సాక్షి
వైఎస్సార్ జిల్లా

శనివారం । 11 । ఫిబ్రవరి । 2023



రాష్ట్రాన్ని అప్పులపాలు చేసింది బాబే

చంద్రబాబుకు చివరి అవకాశం ఇస్తే ప్రజలకు అవే చివరి రోజులవుతాయని మంత్రి ఆర్.కె.రోజా తెలియజేశారు. -12లో..



మరో ఇద్దరు అంతర్‌రాష్ట్ర సైబర్ నేరగాళ్ల అరెస్ట్

మరో ఇద్దరు అంతర్‌రాష్ట్ర సైబర్ నేరగాళ్లను జిల్లా పోలీసులు అరెస్ట్ చేశారు. -8లో..

గరిష్టం/కనిష్టం
34.5/17.2

వాతావరణం

జిల్లాలో శుక్రవారం 17.2 – 34.5 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 3.7 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

-కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

అంగన్‌వాడీలకు ఇంటర్వ్యూలు



ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న ఆర్డీఓ ధర్మచంద్రారెడ్డి

కడప కోటిరెడ్డిసర్కిల్: కడప డివిజన్ పరిధిలో కడప అర్బన్, రూరల్‌తోపాటు ఇతర ప్రాంతాల్లో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ వర్కర్లు, ఆయాల పోస్టులకు శుక్రవారం ఇంటర్వ్యూలు జరిగాయి. కడప ఆర్డీఓ ధర్మచంద్రారెడ్డి హాజరైన వారి పత్రాలను పరిశీలించి ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్‌వాడీల నియామకం పక్కాగా నిర్వహిస్తామని, ఆయా పోస్టుల్లో అన్ని విధాల అర్హులైన వారితోనే నియామకాలు చేపడతాన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకే నియామక ప్రక్రియ కొనసాగుతోందన్నారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ పీడీ ఎం ఎస్ రాణి, తదితరులు పాల్గొన్నారు.

వైజ్ఞానిక ప్రదర్శనకు హాజరుకావాలి

కడప ఎడ్యుకేషన్: పులివెందులలోని ఆహోబిలాపురం ప్రభుత్వ పాఠశాలలో ఈ నెల 13,14 తేదీల్లో నిర్వహించే జిల్లాస్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శనకు ప్రతి మండలం నుంచి ఎంపిక చేసిన ఐదుగురు విద్యార్థులు తమకు కేటాయించి ప్రాజెక్టులతో హాజరుకావాలని డీఈఓ దేవరాజు, జిల్లా సైన్సు అధికారి మహేశ్వరెడ్డిలు తెలిపారు. శుక్రవారం వారు మాట్లాడుతూ ఈ విషయంలో మండల విద్యాశాఖ అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. రాష్ట్రస్థాయి, జిల్లా స్థాయి అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొంటారని, అందువల్ల కార్యక్రమం ప్రాధాన్యతను గుర్తించి మీ మండలం నుంచి మెరుగైన ప్రాజెక్టులను పంపించేటట్లు ఏర్పాటు చేయాలన్నారు. ఏ మండలం నుంచైనా ఐదుగురికి ఒకరు తగ్గినా ఆ మండల విద్యాశాఖ అధికారులదే బాధ్యత అన్నారు. 36 మండలాల నుంచి 180 మంది విద్యార్థులు, గైడ్ టీచర్లు రావాల్సిందేనని ఆదేశించారు. మరింత సమాచారం కోసం 9441035830 నంబర్‌లో సంప్రదించాలని చెప్పారు.

ట్రిపుల్ ఐటీ విద్యార్థులకు పతకాలు



బంగారు, వెండి పతకాలు సాధించిన ట్రిపుల్ ఐటీ విద్యార్థులతో డైరెక్టర్, తదితరులు

వేంపల్లి: జాతీయస్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీల్లో ఇడుపులపాయ ఆర్‌కే వ్యాలీ ట్రిపుల్ ఐటీ విద్యార్థులు బంగారు పతకాలు సాధించినట్లు డైరెక్టర్ సంధ్యారాణి పేర్కొన్నారు. శుక్రవారం ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీలో డైరెక్టర్ మాట్లాడుతూ గతనెల 15 నుంచి 19వ తేదీవరకు మహారాష్ట్రలోని ఔరంగాబాద్ విభాగ్య ఇండోర్ స్టేడియంలో జరిగిన మెన్, ఉమెన్ జాతీయ ఎక్విప్డ్.. బెంచ్ ప్రెస్ చాంపియన్‌షిప్‌లో ట్రిపుల్ ఐటీ విద్యార్థులు జ్యోతి, మాధవిలు పాల్గొని వెండి పతకాలు సాధించగా.. మాస్టర్–2 విభాగం పవర్ లిఫ్టింగ్ పోటీల్లో ఫిజిక్స్ అధ్యాపకులు బాల గోవిందు తివారి పాల్గొని జాతీయ రికార్డు నెలకొల్పి బంగారు పతకాన్ని సాధించారన్నారు. వీరితోపాటు లహరి, నవీన్, ధనుష్, కృష్ణసాయి, కిశోర్, రాకేష్‌లు పాల్గొని ప్రతిభ కనబరిచారన్నారు. పతకాలు సాధించినవారికి డైరెక్టర్, అధ్యాపకులు అభినందనలు తెలిపారు.

నేడు జాతీయ లోక్ అదాలత్



కడప అర్బన్: జిల్లా న్యాయసేవాధికారసంస్థ వారి ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా శనివారం ఉదయం 10:30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నారు.ఇందుకోసం జిల్లావ్యాప్తంగా 25 బెంచీలను ఏర్పాటు చేశారు. మరింత సమాచారం కోసం 08562- 258622, 244622 నంబర్లలో,districts.ecourts.gov.in\kadapa,dlsakadapa @gmail.com లో సంప్రదించవచ్చు. కక్షిదారులు జాతీయలోక్ అదాలత్‌లో తమ కేసులను రాజీ చేసుకుని సత్వర న్యాయం పొందవచ్చు. న్యాయవాదులు, ప్రభుత్వ అధికారులు జాతీయ లోక్ అదాలత్‌ను జయప్రదం చేయాలని మొదటి అదనపు జిల్లా న్యాయమూర్తి, ఇన్‌చార్జి జిల్లా ప్రధాన న్యాయమూర్తి సీఎస్ మూర్తి, డీఎల్ఎస్ఏ సెక్రటరీ, జడ్జి ఎస్. కవితలు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

పట్టాభిషేకం పొందేదెవరు..
పాఠం నేర్చుకునేదెవరు..

- ఉత్సుకత రేపుతున్న పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీల పోరు
- పశ్చిమ రాయలసీమ ఎమ్మెల్సీ పరిధిలో వైఎస్సార్ సీపీదే హవా
- ఆరు జిల్లాలు, 28 అసెంబ్లీ నియోజకవర్గాలకు ప్రాతినిధ్యం
- 36 మంది ఎమ్మెల్యేలు, 6 మంది ఎంపీలు వైఎస్సార్ సీపీ వారే
- ప్రభుత్వ నియామకాలు, ప్రత్యక్ష ఉపాధి అవకాశాలు కలిసివచ్చే అంశం



సాక్షి ప్రతినిధి, కడప: రాయలసీమ పశ్చిమ నియోజకవర్గం పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు షెడ్యూల్ ఖరారైంది. మార్చి 13న నిర్వహించే ఈ ఎన్నికల కోసం ఇప్పటికే ప్రధాన రాజకీయ పార్టీలు ముమ్మరంగా ప్రచారం చేస్తున్నాయి. 38 నియోజకవర్గాల్లో ప్రత్యక్షంగా ఓటర్లను కలుసుకుంటూ మద్దతు కోరుతున్నారు. ఉమ్మడి కడప, అనంతపురం, కర్నూల్ జిల్లాల్లో ఎమ్మెల్సీ సెగ ఊపుందుకుంది. మద్దతుదారుల కోసం వ్యూహాలు పన్నుతూ నేతలు రాజకీయం రక్తి కట్టిస్తున్నారు. ఎవరు 'పట్టా'భిషిక్తులవుతారు..ఎవరు రాజకీయ పాఠాలు నేర్చుకుంటారనే ఉత్కంఠ నెలకొంది.

● పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీలు వెన్నపూస గోపాల్‌రెడ్డి, కత్తి నరసింహారెడ్డిల పదవీకాలం మార్చితో ముగియనుంది. ఆమేరకు ఎన్నికల కమిషన్ షెడ్యూల్ ఖరారు చేసింది. మార్చి 13న పోలింగ్, 16న కౌటింగ్ నిర్వహించాలని నిర్ణయించింది. గడిచిన మూడునెలలుగా అభ్యర్థులు ప్రచార పర్వాన్ని నడిపిస్తున్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా వైఎస్సార్ సీపీ వెన్నపూస రవీంద్రారెడ్డిని ప్రకటించింది. టీడీపీ బి రాంగోపాల్‌రెడ్డి, వామపక్ష పార్టీల అభ్యర్థి నాగరాజుతోపాటు అనేక మంది స్వతంత్రులు బరిలో నిల్చేందుకు వారి వారి ప్రయత్నాలు చేస్తోన్నారు. పశ్చిమ రాయలసీమ పరిధిలో గ్రాడ్యుయేట్లు 3,29,248 మంది ఓటు హక్కును పొందారు. గత ఎన్నికలల్లో 2.52లక్షల మంది మాత్రమే ఓటు హక్కు కల్గి ఉన్నారు. ఆ ఎన్నికలతో పోల్చుకుంటే దాదాపు 77వేల మంది అదనంగా ఓటు హక్కు పొందారు. నూతనంగా ఓటు హక్కు సాధించిన గ్రాడ్యుయేట్లు ఈ ఎన్నికలల్లో క్రియాశీలకం కానున్నారు.

▶▶ఉపాధ్యాయ ఎమ్మెల్సీలో బహుముఖ పోరు...



ఎం.రామ చంద్రారెడ్డి | కత్తి నరసింహారెడ్డి | ఒంటేరు శ్రీనివాసులరెడ్డి

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ బరిలో ఎవ్వరూ ఊహించని విధంగా వైఎస్సార్‌సీపీ అభ్యర్థి ఎం రామచంద్రారెడ్డి దూసుకుపోతున్నారు. టీచర్లతో నిత్యం మమేకం అవుతూ ఉమ్మడి మూడు జిల్లాల్లో విస్తృతంగా పర్యటిస్తున్నారు. పశ్చిమ రాయలసీమ వ్యాప్తంగా 27,774 ఓట్లు నమోదయ్యాయి. సవరించిన నిబంధనల ప్రకారం భారీగా నూతన ఓటర్లు ఓటు హక్కును పొందారు. ఈఎన్నికల్లో సిట్టింగ్ ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి, బీజేపీ నేత ఒంటేరు శ్రీనివాసులరెడ్డి, ప్రధానోపాధ్యాయుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నారాయణరెడ్డిలు ప్రధాన పోటీదారులుగా నిలవనున్నారు. ఎస్టీయూకు చెందిన కత్తి నరసింహారెడ్డిని గత ఎన్నికల్లో సమర్థించిన వివిధ సంఘాల నాయకులు ప్రస్తుతం దూరమయ్యారు. నారాయణరెడ్డి కూడా గడిచిన ఎన్నికలల్లో కత్తి నరసింహారెడ్డిని బలపర్చినట్లు సమాచారం. ఉపాధ్యాయ ఎమ్మెల్సీలో ఎస్టీయూ అభ్యర్థిని సమర్థించిన అనేక ఉపాధ్యాయ సంఘాలు దూరమైయ్యాయని విశ్లేషకులు వెల్లడిస్తున్నారు. బహుముఖ పోరులో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి ఎం రామచంద్రారెడ్డికి అనువుగా మారే అవకాశం ఉందని పరిశీలకులు వివరిస్తున్నారు.

▶▶వైఎస్సార్‌సీపీదే పైచేయి



వెన్నపూస రవీంద్రారెడ్డి | బి.రాంగోపాల్ రెడ్డి, | పట్టుపోగుల పవన్‌కుమార్

వైఎస్సార్‌సీపీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డికి టీడీపీ అభ్యర్థి భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి, అనంతపురం నుంచి బీసీ నాగరాజు, బోరంపల్లి ఆంజనేయులు, పట్టుపోగుల పవన్‌కుమార్, బోయ నాగరాజు తదితరులు పోటీలో ఉన్నా వైఎస్సార్‌సీపీదే పైచేయిగా విశ్లేషకులు వెల్లడిస్తున్నారు. పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ 6 జిల్లాల పరిధిలో 38 అసెంబ్లీ నియోజకవర్గాలు, 6 ఎంపీలు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. వారిలో 36 మంది ఎమ్మెల్యేలు వైఎస్సార్‌సీపీ వారే. ఆరుగురు పార్లమెంటు సభ్యులు వైఎస్సార్‌సీపీకి చెందిన వారే. అంతేకాకుండా సచివాలయాల ఏర్పాటుతో వేలాది మంది నిరుద్యోగులకు ప్రభుత్వ కొలువులు దక్కాయి. పోలీసు రిక్రూట్‌మెంట్, న్యాయశాఖ ఉద్యోగాలు భర్తీ, వైద్య ఆరోగ్యశాఖలో ఖాళీలు భర్తీ, గ్రూప్–1 నోటిఫికేషన్ ఇవన్నీ వైఎస్సార్‌సీపీకి అత్యంత అనుకూలంగా నిలవనున్నట్లు పలువురు వివరిస్తున్నారు. టీడీపీకి ఇద్దరు ఎమ్మెల్యేలు మాత్రమే ఉన్నారు. పైగా వామపక్షాలు బీసీ నాగరాజు అభ్యర్థిత్వాన్ని బలపరుస్తున్నాయి. ఈపరిస్థితుల్లో ప్రధాన ప్రతిపక్ష టీడీపీకి ఘోర పరాభవం తప్పదని పరిశీలకులు వెల్లడిస్తున్నారు. కాకపోతే పోటీకి దూరంగా ఉంటే కేడర్ బలహీన పడుతుందనే భావనతో టీడీపీ రాంగోపాల్‌రెడ్డిని బరిలో దింపిందని పలువురు వివరిస్తున్నారు. టీడీపీ అభ్యర్థి కంటే ఈ మారు వామపక్షాలు బలపరుస్తున్న నాగరాజు కాస్తముందంజలో ఉన్నట్లు సమాచారం.

కోడ్ కూసింది .. ముసుగు పడింది

బద్వేలు అర్బన్ : పశ్చిమ రాయలసీమ నియోజకవర్గ ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు కేంద్ర ఎన్నికల సంఘం షెడ్యూలు విడుదల చేసిన నేపథ్యంలో గురువారం నుంచి ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చింది. దీంతో మున్సిపల్ కమిషనర్ కె.వి. కృష్ణారెడ్డి ఆదేశాల మేరకు పట్టణంలో మున్సిపల్ సిబ్బంది దివంగత రాజకీయ నాయకుల విగ్రహాలకు ముసుగు వేశారు. పట్టణంలో వివిధ రాజకీయ పార్టీలు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను తొలగించే పనిలో మున్సిపల్ సిబ్బంది నిమగ్నమయ్యారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ కె.వి.కృష్ణారెడ్డి మాట్లాడుతూ పట్టణంలో ఎన్నికల కోడ్ పక్కాగా అమలు చేసేందుకు అన్ని రకాల చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ఎన్నికల ప్రక్రియ ముగిసే వరకు కోడ్ అమలులో ఉంటుందని ఆయన పేర్కొన్నారు.



రాజకీయ ప్రముఖుల విగ్రహాలకు ముసుగు వేస్తున్న మున్సిపల్ సిబ్బంది

ప్రశాంత వాతావరణంలో
ఎమ్మెల్సీ ఎన్నికలకు సహకరించాలి



స్ట్రాంగ్ రూమ్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ విజయరామరాజు

రాజకీయ పార్టీ ప్రతినిధులకు కలెక్టర్ సూచన

కడప సిటీ: ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అందరూ సహకరించాలని కలెక్టర్ విజయరామరాజు అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులకు సూచించారు. ఎమ్మెల్సీ ఎన్నికల షెడ్యూలు విడుదలైన నేపథ్యంలో శుక్రవారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో జిల్లాలోని అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాయలసీమ జిల్లాల్లో పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి 5 స్థానాలకు గాను ఎన్నికల నిర్వహణకు ఈ నెల 9 న ఎన్నికల కమిషన్ షెడ్యూల్ విడుదల చేసిందన్నారు. అదే రోజు నుంచి జిల్లాలో ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిందన్నారు. పోలింగ్ స్టేషన్ల జాబితాకు సంబంధించి నివేదికను అనంతపురం జిల్లా కలెక్టర్‌కు పంపించాల్సి ఉందన్నారు. ఈ నేపథ్యంలో ఇప్పటికే విడుదల చేసిన తుది ఓటరు జాబితా ప్రకారం 1400లకు మించి ఓటర్లు ఉన్న పోలింగ్ స్టేషన్లో ఒక్కో ఆక్సిలరీ పోలింగ్ స్టేషన్‌ను ఏర్పాటు చేసుకోవాల్సి ఉందన్నారు. ఆ ప్రకారం జిల్లాలో ఏడు పోలింగ్ స్టేషన్లకు అదనపు పోలింగ్ స్టేషన్ ఏర్పాటు చేసుకునేందుకు గాను సంబంధిత తహసీల్దార్ల నుంచి నివేదికలు వచ్చాయన్నారు.అందులో భాగంగా పులివెందుల నుంచి నాలుగు, ప్రొద్దుటూరు నుంచి ఒకటి పోలింగ్ స్టేషన్ల చొప్పున మొత్తం ఐదు పోలింగ్ స్టేషన్లను లొకేషన్ మార్పు కోరుతూ ఆయా రాజకీయ పార్టీల ప్రతినిధుల నుండి వినతులు వచ్చాయన్నారు.

ఈ నెల 13 వరకు ఓటరు నమోదుకు అవకాశం

ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఈ నెల 13 వ తేదీ సాయంత్రం వరకు వచ్చే ఓటరు నమోదు దరఖాస్తులను మాత్రమే స్వీకరించనున్నట్లు చెప్పారు.అనంతరం వాటిని పరిశీలించి తుది జాబితాలో చేరుస్తామన్నారు. అందులో కూడా ఆన్‌లైన్ ద్వారా వచ్చే దరఖాస్తులను స్వీకరిస్తామన్నారు. కలెక్టరేట్‌లోని ఈవీఎం గోడౌన్ల (స్ట్రాంగ్ రూమ్) ను రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో కలెక్టర్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో నగర కమిషనర్ జీఎస్ఎస్ ప్రవీణ్‌చంద్, ట్రైనీ కలెక్టర్ రాహుల్‌మీనా, డీఆర్వో గంగాధర్ గౌడ్, కలెక్టరేట్ సూపరింటెండెంట్ శివారెడ్డి, ఆయా రాజకీయ పార్టీల నాయకులు ఎం, మల్లికార్జున (వైఎస్సార్ సీపీ), జనార్ధన్ (టిడిపి), నీలి శ్రీనివాసరావు (కాంగ్రెస్), కానుగదానం, సగిలి గుర్రప్ప(బిఎస్పీ), దస్తగిరి(బిజెపి), ఎల్ సుబ్బారెడ్డి(సీపిఐ) తదితరులు పాల్గొన్నారు.

భూ సేకరణ వేగవంతం చేయండి

కడప సిటీ: నీటిపారుదలశాఖకు సంబంధించిన భూ సేకరణ పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ విజయరామరాజు అధికారులను ఆదేశించారు. శుక్రవారం నీటిపారుదలశాఖకు సంబంధించి భూసేకరణ పనులపై తన చాంబర్‌లో అధికారులతో కలెక్టర్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్‌మాట్లాడుతూ రాజోలి ప్రాజెక్టు, జీఎన్ఎస్ఎస్, హెచ్ఎన్ఎస్ఎస్, అలవలపాడు లిఫ్ట్ ఇరిగేషన్, గిడ్డంగివారిపల్లె రిజర్వాయర్, మైక్రో ఇరిగేషన్ సంపులు తదితర పనులపై కలెక్టర్ సమీక్షించారు. వాటికి సంబంధించిన భూ సేకరణ పనులను నిర్దేశించిన సమయంలోగా పూర్తి చేయాలన్నారు. ఈ సమావేశంలో జేసీ సాయికాంత్‌వర్మ, జీఎన్ఎస్ఎస్ ఎస్ఈ మల్లికార్జునరెడ్డి, టీజీపీ ఎస్ఈ శారద, మైనర్ ఇరిగేషన్ ఈఈ వెంకట్రామయ్య, స్పెషల్ కలెక్టర్లు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు పాల్గొన్నారు.

▶▶స్కిల్ కడప పేరుతో నిరుద్యోగ యువతకు ఉపాధి

ప్రభుత్వం అందించే నైపుణ్యాభివృద్ధి కోర్సుల్లో ఉచిత శిక్షణా తరగతులను సద్వినియోగం చేసుకుని నిరుద్యోగ యువత ఉపాధి అవకాశాల్లో మరింత అభివృద్ధి చెందాలని కలెక్టర్ విజయరామరాజు తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో జిల్లాలో చేపడుతున్న వివిధ ట్రైనింగ్ ప్రోగ్రామ్స్, ఉద్యోగ, ఉపాధి అవకాశాలపై వివిధ శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ స్కిల్ కడప అనే పేరుతో వివిధ రంగాల్లో శిక్షణ ఇచ్చి యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెంపొందించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ ఆనందనాయక్, మెప్మా పీడి రామమోహన్ రెడ్డి, డిఐసి జీఎం విజయలక్ష్మి, తదితర జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

టిఫిన్ క్యారీ బాక్సులు స్వాధీనం



స్వాధీనం చేసుకున్న టిఫిన్ క్యారీ బాక్సులు

బద్వేలు అర్బన్ : పశ్చిమ రాయలసీమ ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల షెడ్యూలు విడుదల చేసిన నేపథ్యంలో స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో పంపిణీ చేసేందుకు తీసుకువచ్చిన టిఫిన్ క్యారీ బాక్సులను శుక్రవారం ఎన్నికల డిప్యూటీ తహసీల్దారు బాబాఫక్రుద్దీన్ స్వాధీనం చేసుకున్నారు. మధ్యాహ్నం సమయంలో వచ్చిన అపరిచిత వ్యక్తులు పాఠశాలలోని స్టేజీ వద్ద టిఫిన్ క్యారీ బాక్సుల సంచిని ఉంచారు. ఇది గమనించిన ప్రధానోపాధ్యాయుడు వెంకటసుబ్బారెడ్డి ఎవరు మీరని ప్రశ్నించడంతో సంచిని అక్కడే వదిలేసి ఉడాయించారు. వెంటనే విషయాన్ని తహసీల్దారు మధుసూదన్ రెడ్డికి ఫోన్‌లో సమాచారం ఇవ్వగా ఆయన ఆదేశాల మేరకు ఎన్నికల డిప్యూటీ తహసీల్దారు బాబాఫక్రుద్దీన్, ఆర్ఐ నాగేశ్వరి, వీఆర్‌ఓలు అక్కడికి వెళ్ళి 45 టిఫిన్ క్యారీ బాక్సుల సంచిని స్వాధీనం చేసుకున్నారు. అయితే ఎవరికి మద్దతుగా ఎవరు టిఫిన్ బాక్సులు తీసుకువచ్చారనే విషయం తేలాల్సి ఉంది.

వైఎస్సార్ కల్యాణమస్తు, షాదీతోఫా పథకం ప్రారంభం



లబ్ధిదారులకు మెగా చెక్కును అందజేస్తున్న అధికారులు

జిల్లాలో మొదటి విడతగా 257 జంటలకు రూ.2.20 కోట్లు మంజూరు

కడప సిటీ : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన వైఎస్సార్‌కల్యాణ మస్తు, వైఎస్సార్ షాదీతోఫా పథకం ఆర్థికసాయాన్ని శుక్రవారం రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లాంఛనంగా ప్రారంభించారు. ముఖ్యమంత్రి తాడేపల్లిలోని తన క్యాంపు కార్యాలయం నుంచి వర్చువల్ విధానం ద్వారా మొదటివిడత వైఎస్సార్ కల్యాణమస్తు, వైఎస్సార్ షాదీతోఫా లబ్ధి మొత్తాన్ని లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేసే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమానికి స్థానిక కలెక్టరేట్ వీసీ హాలు నుంచి సాంఘిక సంక్షేమశాఖ జేడీ జయప్రకాశ్, డీఆర్‌డీఏ పీడీ ఆనందనాయక్, ఎస్‌డీసీ రామ్మోహన్‌లు హాజరయ్యారు. ఈ పథకానికి సంబంధించి వైఎస్సార్ జిల్లాలో గతేడాది అక్టోబరు 1వ తేదీ నుంచి డిసెంబరు 31వ తేదీ మధ్యకాలంలో వివాహాలు చేసుకున్న అర్హులైన 257 జంటలకు రూ. 2,20,10,000లను వారి ఖాతాల్లో జమ చేశారు. గతేడాది అక్టోబరు 1 నుంచి డిసెంబరు 31 మధ్య వివాహాలు చేసుకుని అర్హతగల వివిధ వర్గాలకు చెందిన యువతులకు ఆర్థికసాయం అందించారు. ఈ పథకం ద్వారా ఏడాదికి నాలుగుసార్లు అంటే ప్రతి త్రైమాసానికి ఒకసారి అర్హులైన జంటలకు ఆర్థికసాయం ప్రభుత్వం అందజేయనుంది.

వివాహమైన 60 రోజుల్లో దరఖాస్తు చేసుకోవచ్చు

వివాహమైన 60 రోజుల్లో అర్హులైన వారు ఈ పథకానికి దరఖాస్తు చేసుకోవచ్చు. హెచ్‌టీటీపీఎస్://జీఎస్‌డబ్ల్యూఎస్-ఎన్‌బీఎం.ఏపీ.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంటుంది. సంబంధిత అధికారులు దరఖాస్తును పరిశీలించి క్షేత్రస్థాయిలో విచారణ జరిపి అర్హుల జాబితాను ప్రకటిస్తారు. రాష్ట్రంలో గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. ఈ కార్యక్రమంలో ఆయా సంక్షేమశాఖల అధికారులు, లబ్ధిపొందిన వధూవరులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పెన్‌డౌన్ ప్రకటించిన పశువైద్యాధికారులు

కడప అగ్రికల్చర్: కడపలోని బహులార్థ పశువైద్యశాల(వీపీసీ)లో పనిచేస్తున్న డీడీ అచ్చన తీరును నిరసిస్తూ శుక్రవారం నుంచి పెన్‌డౌన్‌ను ప్రకటించినట్లు జిల్లా పశువైద్యుల సేవా సంఘం నాయకులు శివరామిరెడ్డి, సుధాకర్, లక్ష్మినరసయ్య, పశుసంవర్ధశాఖ అధికారుల సంఘం నాయకులు ఏఎస్ఏ శ్రీనివాసులు, నేతాజీ శ్రీధర్‌లింగారెడ్డి, కళ్యాణ్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కడప వీపీసీలో పనిచేసే డీడీ అచ్చన తీరు సరిగా లేదన్నారు. తనకు సరెండర్ చేసే అధికారం లేకపోయినా కార్యాలయంలో పనిచేసే ఐదుగురిని సరెండర్ చేశారన్నారు. ఇద్దరు ఉద్యోగులకు జీతాలను ఆపేశారన్నారు. వీటన్నింటిపైన ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని, ఆయనను ఇక్కడి నుంచి బదిలీ చేయాలన్నారు. ఈ విషయాన్ని జిల్లా పశువైద్యాధికారి శారదమ్మకు తెలియజేశామని తెలిపారు. పెన్‌డౌన్ కారణంగా జిల్లాలో ఆసుపత్రులకు వచ్చిన పశువులకు అత్యవసర చికిత్సలకు మాత్రమే వైద్యం చేస్తామని ప్రకటించారు. రికార్డెడ్‌గా సమాచారాన్ని హెడ్ ఆఫీసుకు తెలియజేయమన్నారు.

జేఎన్‌టీయూను సందర్శించిన వీసీ



మాట్లాడుతున్న అనంతపురం జేఎన్‌టీయూ వీసీ జి.రంగ జనార్ధన్

పులివెందుల రూరల్ : పట్టణంలోని ముద్దనూరు రోడ్డులో ఉన్న జేఎన్‌టీయూ కళాశాలను శుక్రవారం వైవీయూ ఇన్‌చార్జి వీసీ, అనంతపురం జేఎన్‌టీయూ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ జి.రంగ జనార్దన్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన కళాశాల అధ్యాపకులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. అనంతరం మాట్లాడుతూ కళాశాల అధ్యాపకులందరూ ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్స్, కాన్ఫరెన్స్‌లు, వర్క్‌షాపులలో పాల్గొని పైపు జ్ఞానాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. ప్రధానమంత్రి గతిశక్తి, ఉమెన్ ఎంపవర్‌మెంట్ గురించి వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ ప్రొఫెసర్ వసుంధర, వైస్ ప్రిన్సిపల్ రమణారెడ్డి పాల్గొన్నారు.

రేపు జిల్లా మాజీ సైనికుల సమావేశం

వైవీయూ : కడప నగరంలోని సీఎస్ఐ హైస్కూల్‌లో ఈనెల 12వ తేదీ ఆదివారం ఉదం 10 గంటలకు జిల్లా మాజీ సైనికుల సమావేశం నిర్వహిస్తున్నట్లు జిల్లా మాజీ సైనికుల సంక్షేమ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు పి. లక్ష్మీనారాయణ, బి.వి. గోపాల్‌రెడ్డి తెలిపారు. సైనికుల పునరావాసం, మిలటరీ హాస్పిటల్, క్యాంటీన్, సైనిక కార్యాలయం, లైఫ్‌సర్టిఫికెట్ సమర్పణ, సర్వీస్ సంబంధిత అంశాలపై చర్చించనున్నట్లు తెలిపారు.

గాయపడ్డ వీఆర్ఓ మృతి


శ్రీనివాసులరెడ్డి (ఫైల్)

రాజుపాళెం : మండలంలోని కుమ్మరపల్లె వంక వద్ద ఆర్టీసీ అద్దె బస్సు, ద్విచక్రవాహనం ఢీకొన్న ప్రమాదంలో గాయపడిన రాజుపాళెం వీఆర్ఓ గుద్దేటి శ్రీనివాసులరెడ్డి శుక్రవారం తెల్లవారుజామున మృతి చెందాడు. గత నెల 28న ఆయన స్వగ్రామమైన పెద్దముడియం మండలం ఉప్పలూరు నుంచి రాజుపాళెంకు ద్విచక్రవాహనంలో వస్తూ కుమ్మరపల్లె వంక వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. బెంగళూరు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నా పరిస్థితి విషమించడంతో శుక్రవారం మృతి చెందాడు. శ్రీనివాసులరెడ్డి మృతి పట్ల తహసీల్దార్ ఇందిరారాణి, డిప్యూటీ తహసీల్దార్ వెంకటసాయినాథ్‌రెడ్డి, వీఆర్‌ఓలు, సచివాలయ ఉద్యోగులు, ఇన్‌చార్జి ఎంపీపీ నారాయణరెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు అంజనీకుమారి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గుద్దేటి రాజారాంరెడ్డి సంతాపం తెలిపారు. మృతుడి కుమారుడు మురళిరెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రాజగోపాల్ తెలిపారు. ఆయన మృతదేహాన్ని శనివారం స్వగ్రామమైన పెద్దముడియం మండలం ఉప్పలూరు గ్రామానికి తీసుకురానున్నారు.

భారీగా చౌకదుకాణం బియ్యం పట్టివేత

688 బస్తాలు, 5 వాహనాలు సీజ్

ముద్దనూరు : మండలంలోని యామవరం గ్రామ సమీపంలో వున్న రైస్ మిల్లుకు తరలిస్తున్న చౌకదుకాణం బియ్యాన్ని విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు శుక్రవారం పట్టుకున్నారు. 688 బస్తాల బియ్యం, 5 వాహనాలను వారు సీజ్ చేసి, కేసు నమోదు చేశారు. విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐలు రామకృష్ణ, రెడ్డప్ప తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. యామవరం శివారులోని శ్రీభ్రమరాంబ రైస్‌మిల్లును విజిలెన్స్ అధికారులు తనిఖీ చేశారు. అక్రమంగా కొనుగోలు చేసి రవాణాకు సిద్ధంగా ఉంచిన 520 బస్తాల (26 టన్నుల) బియ్యం.. ఒక లారీ, టాటా మ్యాజిక్, బొలెరో వాహనాలలో రైస్ మిల్లులోకి తరలిస్తున్న 86 బియ్యం బస్తాలను పట్టుకున్నారు. రైస్ మిల్లు యజమాని నవీన్‌కుమార్‌రెడ్డి, వాహనాల డ్రైవర్లు హేమంత్, లోకేష్, గంగాధర్‌పై కేసు నమోదు చేశారు. అలాగే యామవరం గ్రామ శివారులో పెద్దమ్మ గుడి వద్ద అదే రైస్ మిల్లుకు రెండు వాహనాలలో తరలిస్తున్న 82 బస్తాల బియ్యాన్ని పట్టుకుని సీజ్ చేశారు. ఈ కేసులో మునీంద్ర, రాము, సంజీవ రాయుడు అనే వ్యక్తులపై కేసు నమోదు చేశారు. బియ్యాన్ని స్థానిక డిప్యూటీ తహసీల్దారు వరదకిషోర్‌రెడ్డికి అప్పగించారు.

రూ.40 లక్షల సెల్‌ఫోన్‌ల రికవరీ

- 131 మంది బాధితులకు అప్పగింత
- సత్ఫలితాలిస్తున్న ఎంఎంటీఎస్
- ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్


జిల్లా పోలీస్ అధికారులతో అందుకున్న సెల్‌ఫోన్‌లు చూపిస్తున్న బాధితులు

కడప అర్బన్ : జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో రూపొందించిన మిస్సింగ్ మొబైల్ ట్రాకింగ్ సిస్టం (ఎంఎంటీఎస్) ప్రారంభించిన అతి తక్కువ సమయంలోనే సత్ఫలితాలు ఇస్తోంది. ఈ పద్ధతి ద్వారా దాదాపు రూ.40 లక్షల విలువైన 131 మొబైల్స్‌ను రికవరీ చేసి జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ చేతుల మీదుగా శుక్రవారం బాధితులకు అందజేశారు. ఈ సందర్భంగా కడపలోని పోలీసు కార్యాలయం వద్ద వున్న 'పెన్నార్ పోలీస్ కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఎస్పీ సెల్‌ఫోన్‌ల మిస్సింగ్, ఫిర్యాదులు, రికవరీల గురించి వివరించారు. ఫోన్‌లు పోగొట్టుకున్న వారికి పోలీస్‌స్టేషన్‌కు వెళ్లకుండా, ఎఫ్ఐఆర్ నమోదు లేకుండా తిరిగి అందజేయాలనే సంకల్పంతో.. గతేడాది డిసెంబర్ 1న మిస్సింగ్ మొబైల్ ట్రాకింగ్ సిస్టం అనే ఉచిత వెబ్‌సైట్ సేవలు ప్రారంభించినట్లు తెలిపారు. ఈ విధానంలో ప్రజలకు మరింత సులువుగా చాట్ బాక్స్ ద్వారా (వాట్సాప్ నంబర్ 93929 41541) సేవలు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇప్పటి వరకూ 2300 మొబైల్స్ మిస్సింగ్ ఫిర్యాదులు అందగా.. 510 యాక్టివ్ మొబైల్స్‌ను గుర్తించినట్లు చెప్పారు. మిగిలిన మొబైల్స్‌ను కూడా రికవరీ చేసి బాధితులకు అందిస్తామని తెలియజేశారు. రెండు దఫాలుగా మొత్తం రూ.70 లక్షల విలువైన 261 సెల్ ఫోన్‌లను రికవరీ చేసి అందజేసినట్లు వివరించారు. సరైన బిల్లులు లేకుండా ఎవరూ మొబైల్ ఫోన్‌లను కొనుగోలు చేయవద్దని సూచించారు. అనంతరం జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్‌కు 'థ్యాంక్యూ ఎస్పీ సార్' అంటూ బాధితులు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు ఎస్పీ (అడ్మిన్) తుషార్ డూడీ, ఫ్యాక్షన్ జోన్ డీఎస్పీ చెంచుబాబు పాల్గొన్నారు. మొబైల్ ఫోన్‌ల రికవరీలో జిల్లా అదనపు ఎస్పీ (అడ్మిన్) ఆధ్వర్యంలో ఏర్పాటైన ఫ్యాక్షన్ జోన్ డీఎస్పీ చెంచుబాబు, సైబర్ క్రైమ్ టెక్నికల్ విభాగం ఇన్‌స్పెక్టర్ వి.శ్రీధర్ నాయుడు, ఎస్‌ఐలు మధుమల్లేశ్వర్‌రెడ్డి, రవి కుమార్, ఆర్ఎస్ఐ శ్రీనివాసులు బృందాన్ని ఎస్పీ అభినందించి, ప్రశంసా పత్రాలను అందజేశారు.

కడప రైల్వేస్టేషన్‌లో తనిఖీలు


రైల్వేస్టేషన్‌లో తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసు సిబ్బంది

కడప కోటిరెడ్డిసర్కిల్ : కడప రైల్వేస్టేషన్‌లో రైల్వే ఇన్‌స్పెక్టర్ మహమ్మద్‌బాబా, ఐపీఎఫ్ శ్రీనివాసులు ఆధ్వర్యంలో సిబ్బంది శుక్రవారం విస్తృత తనిఖీలు నిర్వహించారు. రైల్వే ఎస్పీ చౌడేశ్వరి, డీఎస్పీ షేక్ షాను ఆదేశాల మేరకు వారు పోలీసు జాగిలాలు, బాంబు స్క్వాడ్ బృందాల సహకారంతో అనుమానాస్పద వ్యక్తుల లగేజీ బ్యాగులు, పార్సిల్ కార్యాలయంలోని పలు ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించారు. మాదక ద్రవ్యాలు, పేలుడు పదార్థాలు, ఇతర అక్రమ రవాణాపై వైఎస్సార్ జిల్లా ఎస్పీ అన్బురాజన్ సూచనలతో తనిఖీలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐలు రారాజు, శ్రీనివాసవర్మ, విజయ్, ఏఆర్ ఎస్‌ఐ జగన్‌మోహన్‌రెడ్డి, బాంబు స్క్వాడ్ ఇన్‌చార్జి రాంబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

కడప ఆకాశవాణిని క్లస్టర్‌గా చేయాలి

రౌండ్ టేబుల్ సమావేశంలో ప్రజాసంఘాల నాయకులు


మాట్లాడుతున్న సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు కొనిరెడ్డి శివచంద్రారెడ్డి

ప్రొద్దుటూరు క్రైం : ఆకాశవాణి కడప కేంద్రాన్ని విజయవాడకు తరలించవద్దని ప్రజాసంఘాల నాయకులు విజ్ఞప్తి చేశారు. ప్రొద్దుటూరులోని జనవిజ్ఞాన వేదిక కార్యాలయంలో రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. రాయలసీమ కడప ఆకాశవాణిని ఒక క్లస్టర్‌గా చేయాలని వారు డిమాండ్ చేశారు. కడప రేడియో స్టేషన్‌ను నిలబెట్టుకునే బాధ్యత సీమవాసులందరిదని వారంతా ముక్తకంఠంతో అన్నారు. అందరూ కలసి ఒక కార్యాచరణ ప్రణాళికను రూపొందించుకుంటున్నామని సమావేశకర్తలైన ఖలందర్, సృజన శ్రీను అన్నారు. సీపీఐ ముందు వరుసలో నిలిచి పోరాడుతుందని సుబ్బరాయుడు తెలిపారు. మనకెందుకులే అని ఊరుకుంటే మనం రాయలసీమలో ఏమి మిగలబెట్టుకోలేమని, పోరాడి రేడియో స్టేషన్‌ను నిలబెట్టే ప్రయత్నం చేయాలని విరసం వరలక్ష్మి అన్నారు. అధ్యక్షుడు కుతుబుద్దీన్ మాట్లాడుతూ రాయలసీమ సాంస్కృతిక వేదికలైన రేడియో స్టేషన్‌ను తరలించకుండా తమవంతు కృషి చేస్తామని తెలిపారు. సమావేశంలో సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు కొనిరెడ్డి శివచంద్రారెడ్డి మాట్లాడుతూ ఈ విషయమై తాను ఇదివరకే ఎంపీల దృష్టికి తీసుకెళ్లానన్నారు. అందరం జిల్లాలోని ఎమ్మెల్యేలను కలిసి వినతి పత్రాలను అందచేయాలన్నారు. ఈ విషయాన్ని ఎమ్మెల్యేల ద్వారా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తే సమస్య పరిష్కారం అవుతుందని తెలిపారు. సమావేశంలో పల్లవోలు రమణ, జేవీవీ సునీత, నాగేష్, రామేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కారు బోల్తా.. యువకుడి మృతి

– ముగ్గురు మహిళలకు గాయాలు

వేముల : వేముల సమీపంలో శుక్రవారం తెల్లవారుజామున 2 గంటల ప్రాంతంలో కారు బోల్తా పడటంతో ఓ యువకుడు మృతి చెందగా.. ముగ్గురు మహిళలకు గాయాలయ్యాయి. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. పెండ్లిమర్రి మండలం ఏనుగువారిపల్లె వారికి చెందిన పేర్ల శివశంకర్‌రెడ్డి(33) వేంపల్లెలో జరిగిన బంధువుల పెళ్లికి కారులో వచ్చాడు. భోజనం అనంతరం బంధువులను వదిలిపెట్టేందుకు పులివెందులకు కారులో వెళ్లాడు. అక్కడ బంధువులను వదిలిపెట్టి వేంపల్లెకు వస్తుండగా.. చెరువు కట్ట సమీపంలోకి రాగానే కారు అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో పేర్ల శివశంకర్‌రెడ్డి మృతి చెందగా.. కుమారి, పార్వతమ్మ, కొండమ్మకు గాయాలయ్యాయి. ఈ సంఘటనపై బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఆర్‌కే వ్యాలీ ఇన్‌చార్జి ఎస్‌ఐ రంగరావు తెలిపారు.

బైక్‌ను ఢీకొన్న లారీ

– యువకుడి మృతి


మృతి చెందిన బాబు

పోరుమామిళ్ల : పట్టణ శివారులోని మల్ల కతువ వద్ద గురువారం రాత్రి 11 గంటల ప్రాంతంలో బైక్‌ను లారీ ఢీకొనడంతో ఓ యువకుడు మృతి చెందాడు. ఏఎస్‌ఐ రాజశేఖర్‌రెడ్డి కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మండలంలోని దమ్మన్నపల్లెకు చెందిన కమలాపురం బాబు(30) తమ్ముడితో కలిసి పోరుమామిళ్ల నుంచి తమ గ్రామానికి బైక్‌పై వెళుతుండగా ఎదురుగా కొమరోలు వైపు నుంచి వస్తున్న లారీ ఢీకొట్టి ఆగకుండా వెళ్లిపోయింది. ఈ ప్రమాదంలో తలకు తీవ్ర గాయం కావడంతో బాబు కింద పడిపోయాడు. ఆసుపత్రికి తరలించగా వైద్యులు అతను మృతి చెందినట్లు నిర్ధారించారు. బాబు తమ్ముడు స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. మృతునికి భార్య, ముగ్గురు కూతుర్లు, ఒక కుమారుడు ఉన్నారు. భార్య అల్లూరమ్మ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఏఎస్‌ఐ రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం పోస్టుమార్టం నిర్వహించి సాయంత్రం మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు.

చెట్టును ఢీకొని కాలువలో పడ్డ లారీ


మురుగునీటి కాలువలో పడ్డ లారీ

సిద్దవటం : మండలంలోని భాకరాపేట గ్రామ శివారులో లారీ శుక్రవారం తెల్లవారు జామున చెట్టును ఢీకొని పక్కనే ఉన్న మురుగు నీటి కాల్వలో పడింది. కర్ణాటకకు చెందిన లారీ చెన్నై నుంచి పాత ఇనుప సామాను లోడుతో బళ్లారి వెళ్తోంది. మార్గం మధ్యలో లారీ అదుపు తప్పి చెట్టును ఢీకొనడంతో పక్కనే ఉన్న మురుగు నీటి కాలువలో పడింది. ఈ ప్రమాదంలో ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదు. లారీ ముందు భాగం కొంత దెబ్బతినింది.

స్పెషల్ డ్రైవ్‌లో 314 కేసులు

కడప అర్బన్ : జిల్లాలో పోలీసులు చేపట్టిన వాహనాల స్పెషల్ డ్రైవ్‌లో శుక్రవారం 314 కేసులు నమోదు చేశారు. హెల్మెట్ ధరించకుండా ద్విచక్ర వాహనాలను నడిపిన 301 మందిపై, సీటు బెల్ట్ ధరించకుండా కార్లు, జీపులు, తదితర వాహనాల్లో వెళ్తున్న 13 మందిపై కేసులు నమోదు చేసినట్లు జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ తెలిపారు.

నాటుసారా పట్టివేత

కలసపాడు : మండల పరిధి తెల్లపాడు అటవీ ప్రాంతంలోని తుమ్మలకుంట చెరువు వద్ద శుక్రవారం 12 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ సీఐ మురళీమోహన్, స్థానిక ఎస్‌ఐ నాగమురళి తెలిపారు. తెల్లపాడు గ్రామానికి చెందిన ఎం.పెద్దనరసింహులు నాటుసారా కాస్తుండగా 60 లీటర్ల ఊటను ధ్వంసం చేసి, 12 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నారు. పెద్దనరసింహులును అదుపులోకి తీసుకుని అతనిపై కేసు నమోదు చేశారు. ఈ దాడుల్లో ఎస్ఈబీ కానిస్టేబుల్ ఇంద్రసేనారెడ్డి, ఎస్బీ కానిస్టేబుల్ రమేష్, వీఆర్ఓ, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

కమర్షియల్ బ్యాంకులకు దీటుగా డీసీసీ బ్యాంకు


సమావేశంలో మాట్లాడుతున్న ఆప్కాబ్, డీసీసీ బ్యాంకు చైర్‌పర్సన్ మల్లెల ఝాన్సీరాణి

కడప అగ్రికల్చర్ : కమర్షియల్ బ్యాంకులకు దీటుగా ఖాతాదారులకు అందిస్తున్నామని, డీసీసీ బ్యాంకును నష్టాలబాట నుంచి లాభాలబాట పట్టించామని ఆప్కాబ్, డీసీసీ బ్యాంకు చైర్‌పర్సన్ మల్లెల ఝాన్సీరాణి పేర్కొన్నారు. కడప డీసీసీ బ్యాంకు ఏర్పాటై 105 ఏళ్లు పూర్తయిన సందర్భంగా శుక్రవారం వ్యవస్థాపక దినోత్సవాన్ని బ్యాంకు సీఈఓ కందుల రాజేంద్రకుమార్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సలహాలు, సూచనల మేరకు మండలానికి ఒక బ్రాంచి ప్రారంభించేందుకు ఆర్‌బీఐకి దరఖాస్తు చేశామన్నారు. సీఈఓ మాట్లాడుతూ కడప డీసీసీ బ్యాంకు ఎన్నో విషయాల్లో ముందు ఉందని అయితే మొండి బకాయిలు ఎక్కువగా ఉన్నాయన్నారు. అనంతరం బ్యాంకు ఉద్యోగులకు పలు రకాల ఆటల పోటీలను నిర్వహించారు. విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో సీటీసీ ప్రిన్సిపాల్ గురప్ప, బ్యాంకు డైరెక్టర్లు వెంకట సుబ్బారెడ్డి, హుస్సేన్, సొసైటీ ప్రెసిడెంట్లు, బ్యాంకు సలహాదారు సహదేవరెడ్డి, డీజీఎంలు రోజామణి, ప్రతాప్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, బాలిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ హయాంలోనే ఎగువభద్రకు అనుమతులు

కడప అగ్రికల్చర్ : ఎగువ భద్ర ప్రాజెక్టుపై మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాడు ఏం చేస్తున్నారని రాష్ట్ర ఉద్యాన సలహాదారు సంబటూరు ప్రసాద్‌రెడ్డి ప్రశ్నించారు. 2017లో తెలుగుదేశం హయాంలోనే ప్రాజెక్టు కోసం స్టేజ్–2 అనుమతులు వచ్చాయని, ఈ విషయం చంద్రబాబుకు గుర్తులేదా అన్నారు. స్థానికంగా ఆయన శుక్రవారం ‘సాక్షి’తో మాట్లాడారు. 2019లో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే పలుమార్లు అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ కేంద్రానికి లేఖలు రాసిందన్నారు. కేంద్ర ప్రభుత్వం తాజా నిర్ణయంపై న్యాయ పోరాటం చేస్తామన్నారు.

అప్పుడే నూరేళ్లు నిండాయా..!

- డ్రైనేజీలో పడి బాలుడి మృతి
- కన్నీరుమున్నీరుగా విలపించిన బాధిత కుటుంబం


బాలుడి మృతదేహం వద్ద విలపిస్తున్న కుటుంబీకులు, బంధువులు

సిద్దవటం : 'అప్పుడే నూరేళ్లు నిండాయా కన్నా'.. అంటూ తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు గుండెలవిసేలా రోదించారు. అల్లారుముద్దుగా పెంచుకున్న తమ కుమారుడు మృత్యువాత పడటంతో వారు కన్నీరుమున్నీరయ్యారు. సిద్దవటం మండలంలోని నేకనాపురం గ్రామంలో శుక్రవారం సాయంత్రం డ్రైనేజీ కాలువలో పడి ఓ బాలుడు మృతి చెందాడు. ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. నేకనాపురం గ్రామం ఎస్సీ కాలనీకి చెందిన గంపల సునీత, హరీష్‌లకు కొడుకు, కూతురు ఉన్నారు. వీరిలో కొడుకు అభిరామ్(4) పెద్దవాడు. శుక్రవారం సాయంత్రం పిల్లలతో కలిసి ఆడుకుంటూ ఉండగా గ్రామ సమీపంలోని డ్రైనేజీ కాలువలో ప్రమాదవశాత్తు పడ్డాడు. ఈ విషయాన్ని తోటి పిల్లలు ఇంట్లో చెప్పడంతో వారు వచ్చి బయటకు తీశారు. అప్పటికే మృతి చెందాడు. దీంతో కుటుంబీకులు, బంధువులు కన్నీటి పర్యంతమై బోరున విలపించారు.

మరో ఇద్దరు అంతర్‌రాష్ట్ర సైబర్ నేరగాళ్ల అరెస్ట్

- ఆధార్ ఆధారిత సమాచారం దుర్వినియోగంతో డబ్బులు కాజేసిన వైనం
- ఇటీవలే ప్రధాన నిందితుడి అరెస్ట్
- జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్


వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్

కడప అర్బన్ : మరో ఇద్దరు అంతర్‌రాష్ట్ర సైబర్ నేరగాళ్లను జిల్లా పోలీసులు అరెస్ట్ చేశారు. ఉత్తర ప్రదేశ్ నుంచి వారిని కడపకు తీసుకొచ్చి జిల్లా పోలీసు కార్యాలయంలో శుక్రవారం మీడియా ఎదుట హాజరు పరిచారు. ఇటీవలి కాలంలో జిల్లాలోని కొంత మంది ప్రజలు తమ బ్యాంక్ అకౌంట్ నుంచి తమకు తెలియకుండా నగదు బదిలీ అవుతోందని ఫిర్యాదు చేశారు. కడప నగరంలోని చిన్నచౌక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో పక్కీరుపల్లికి చెందిన సానపు రాజశేఖర్‌రెడ్డి గతేడాది జూన్ 21 నుంచి 29 వరకు కెనరా, యూనియన్ బ్యాంక్‌ల అకౌంట్‌ల నుంచి తనకు తెలియకుండా రూ.89,550లను వేరే బ్యాంక్ ఖాతాలకు నగదును ఎవరో బదిలీ చేసుకున్నట్లు ఫిర్యాదు చేశారు. తాను ఎవరికీ ఓటీపీలు చెప్పడం గానీ, ఎలాంటి లింక్‌లు గానీ ఓపెన్ చేయలేదని ఫిర్యాదు చేశారు. ఈ మేరకు చిన్నచౌక్ పోలీసులు కేసు నమోదు చేశారు. జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ ఆదేశాల మేరకు జిల్లా అదనపు ఎస్పీ (అడ్మిన్) తుషార్ డూడీ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాన్ని నియమించి విచారణ చేపట్టారు. నేరస్తులు ఆధార్ ఎనేబుల్ సిస్టం (ఏఈపీఎస్) ద్వారా ఫిర్యాది బయోమెట్రిక్ (వేలిముద్ర)లు నకిలీవి సృష్టించి, వాటి సాయంతో (బ్యాంక్ బిజినెస్ కరస్పాండెంట్స్ ఏజెంట్స్) కస్టమర్ సర్వీస్ పాయింట్‌లలోని బయోమెట్రిక్ డివైజ్ స్కానర్స్‌లో స్కాన్ చేశారు. ఆధార్ కార్డుకు లింక్ వున్న బ్యాంక్ అకౌంట్‌ల నుంచి రోజుకు రూ.10వేలు చొప్పున మొత్తం రూ. 89,550 విత్‌డ్రా చేసినట్లు పోలీసులు గుర్తించారు.

సాంకేతిక నైపుణ్యం ఆధారంగా ఛేదన

సాంకేతిక నైపుణ్యం ఆధారంగా విత్‌డ్రా జరిగిన ప్రాంతాన్ని పోలీసులు తెలుసుకున్నారు. బ్యాంక్ బిజినెస్ ఏజెంట్ల నుంచి సమాచారం సేకరించారు. నేరం చేసేటపుడు సైబర్‌నేరగాళ్లు వదిలిన డిజిటల్ పుట్ ప్రింట్స్ ఆధారంగా వారి పూర్తి వివరాలను తెలుసుకున్నారు. సైబర్ నేరగాళ్లు ఈ తరహా ఏఈపీఎస్ స్కాంలను ఉత్తర ప్రదేశ్ రాష్ట్రంలోని గోరక్‌పూర్ జిల్లాలోని ఖజని ప్రాంతంలో ఆపరేట్ చేస్తున్నారని కనుక్కున్నారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు ప్రత్యేక బృందం ఉత్తర ప్రదేశ్‌కు చేరుకుని సైబర్ నేరగాళ్ల సమాచార విశ్లేషణ ఆధారంగా ట్రాక్ చేసి కనుగొన్నారు. ఇందులో మొదటగా జనవరి 22న శేషనాథ్ విశ్వకర్మను అరెస్ట్ చేసి విచారణ చేశారు. ఆయన స్నేహితులైన వికాస్ అలియాస్ విక్కి, అక్షయ్‌యాదవ్‌తో కలిసి హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకులో అకౌంట్‌లను ఓపెన్ చేసి, తన పేరుతో కస్టమర్ సర్వీస్ పాయింట్, జనసేవాకేంద్రం పర్మిషన్ పొందారు. ఆ షాప్ ద్వారా స్పైస్ మనీ, పే నియర్‌బై మర్చంట్‌లతో ఒప్పందం ద్వారా డెబిట్‌కార్డు లేకుండా ఆధార్ కార్డు నంబరు, బయోమెట్రిక్ (వేలిముద్రలు) సాయంతో చిన్నమొత్తాలలో నగదు విత్‌డ్రా చేసే ఏఈపీఎస్ బయోమెట్రిక్ డివైస్‌ను పొందారు. ఈ ఏఈపీఎస్ ద్వారా తన స్నేహితులు వికాస్ అలియాస్ విక్కి, అక్షయ్‌యాదవ్‌లు ఆంధ్రప్రదేశ్, తెలంగాణా, ఇతర రాష్ట్రాలకు చెందిన వ్యక్తుల ఆధార్ సమాచారాన్ని దొంగచాటుగా సేకరించారు. వాటి ద్వారా నకిలీ వేలిముద్రలను తయారు చేసి ప్రజల బ్యాంక్ ఖాతాల నుంచి తమ హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు ఖాతాలకు నగదును బదిలీ చేసేవారు. ఈ విధంగా ఇప్పటికే 440 మంది నకిలీ ముద్రలను తయారు చేసి వారి బ్యాంక్ ఖాతాల నుంచి డబ్బులను కాజేశారని గుర్తించారు. ఇప్పటికే ప్రధాన నిందితుడు శేషనాథ్ విశ్వకర్మను ఇటీవలే అరెస్ట్ చేశారు. అతన్ని విచారించిన ఆధారంగా ఉత్తరప్రదేశ్ రాష్ట్రం గోరక్‌పూర్ జిల్లా జైలులో వున్న వికాస్, అక్షయ్‌యాదవ్‌లను పి.టి వారెంట్ ద్వారా ఈనెల 6న జుడిషియల్ కస్టడీకి అప్పగించారు. ఇంకా ఈ ఏఈపీఎస్ స్కాంలో పాల్గొన్న గోరఖ్ పూర్‌కు చెందిన పాండే వున్నారని, అతని కోసం ప్రత్యేక టీమ్ నియమించామన్నారు. ప్రజలందరూ తమ ఆధార్ కార్డ్‌లను యుఐడిఏఐ.జిఓవి.ఇన్ వెబ్‌సైట్‌లో లాగిన్ అయ్యి తమ బయోమెట్రిక్‌లను ఓటీపీలతో అనుసంధానం చేసుకుని భద్రపరచుకోవాలని ఎస్పీ సూచించారు. ఇలాంటి మోసాలకు గురైన బాధితులెవరైనా వుంటే పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని ఎస్పీ సూచించారు. నిందితులను అరెస్ట్ చేయడంలో కృషి చేసిన చిన్నచౌక్ సీఐ శ్రీరామ్ శ్రీనివాసులు, సైబర్ క్రైమ్ సెల్ సీఐ శ్రీధర్‌నాయుడు, చిన్నచౌక్ ఎస్‌ఐ అమర్‌నాథ్‌రెడ్డి, సైబర్ క్రైమ్ సెల్ ఎస్‌ఐలు మధుమల్లేశ్వర్‌రెడ్డి, రవికుమార్, సిబ్బందిని ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.